సాక్షి
చిత్తూరు
బుధవారం । 10 । జనవరి । 2024



'ఆదర్శనీయ క్షేత్రం'.. బోయకొండ
బోయకొండ ఆదర్శనీయంగా అభివృద్ధి చెందుతోంది. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. - 8లో



వస్తువుల తొలగింపునకు కమిటీ
జిల్లాలోని ఖజానా కార్యాలయాల స్ట్రాంగ్ రూమ్‌లలో వస్తువులను తొలగించేందుకు కమిటీ ఏర్పాటు చేశారు. - 8లో



గ్రామీణాభివృద్ధికి కృషి
గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఓటరు కార్డుల పంపిణీకి కసరత్తు



కలెక్టరేట్‌లో ఓటరు కార్డుల బాక్సులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఓటరు కార్డుల పంపిణీకి పకడ్బందీగా కసరత్తు చేస్తున్నారు. నూతన ఓటర్లతోపాటు చేర్పులు, మార్పులకు దరఖాస్తు చేసుకున్న వారికి కార్డులు అందించనున్నారు. ఎన్నికల సంఘం నుంచి పోస్టాఫీస్ ద్వారా కలెక్టరేట్‌కు వచ్చిన ఓటరు కార్డులను స్కాన్ చేసే ప్రక్రియను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. స్కాన్ చేసిన అనంతరం కార్డులను పోస్టాఫీస్‌కు పంపేందుకు చర్యలు చేపడుతున్నారు. పోస్టాఫీసులో మరోసారి స్కాన్ చేసి ఆ తర్వాత ఓటరు కార్డులను నేరుగా సంబంధిత ఓటరు చిరునామాకు పంపనున్నారు. మొత్తం ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్నికల విభాగం అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

సేవా లోపంపై ఏఈల జీతాలు కోత

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారులకు సక్రమంగా సేవలందించని ట్రాన్స్‌కో ఏఈలపై ఏపీఈఆర్సీ చర్యలు చేపట్టింది. సేవాలోపం కింద ఏఈల వేతనాల్లో కోత విధిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది ఏప్రిల్ 23 నుంచి మూడునెలల పాటు వినియోగదారులకు సక్రమంగా సేవలందించకపోవడంతో ఈ నిర్ణయి తీసుకుంటున్న పేర్కొంది. డిస్కం అధికారుల నివేదిక మేరకు ఉమ్మడి జిల్లాలోని ఏఈల జీతాల నుంచి రూ.94,750 కట్ చేయాలని ఆదేశించింది.

రేపటి నుంచి ఇంటర్ విద్యార్థులకు సెలవులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఇంటర్మీడియట్ కళాశాలలకు ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ఇస్తున్నట్లు డీవీఈఓ సయ్యద్ మౌలా తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 18వ తేదీన కాలేజీలు పునఃప్రారంభమవుతాయన్నారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పీఎంపీ క్లినిక్‌ల తనిఖీ



యాదమరిలోని క్లినిక్ తనిఖీ చేస్తున్న వైద్యాధికారి అనిల్‌కుమార్

యాదమరి: మండలంలోని పలు పీఎంపీ (ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్లు)లు నిర్వహిస్తున్న క్లినిక్‌లను వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొందరు పీఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా రోగులకు ఇంజెక్షన్లు వేస్తున్నట్లు, మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై వైద్యాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. ఇకపై పీఎంపీల వద్ద మందులు ఉన్నట్లు తెలిస్తే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద 14 రకాల వైద్య పరీక్షలు చేయించి, అవసరాల మేరకు 107 రకాల మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. పీఎంపీలు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి పంపించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

డీఈఎల్‌ఈడీ పరీక్షకు 42 మంది హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : డీఈఎల్‌ఈడీ (డిప్లొమో కోర్స్ ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) రెండో సెమిస్టర్ పరీక్షకు 42 మంది అభ్యర్థులు హాజరైనట్లు డీఈఓ విజయేంద్రరావు వెల్లడించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కార్వేటినగరంలోని ప్రభుత్వ డైట్ కళాశాల కేంద్రంలో డీఈఎల్‌ఈడీ రెండో సెమిస్టర్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించినట్లు తెలిపారు.

ఎస్వీయూలో 12న జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టీ శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్న ఈ జాబ్‌మేళాలో సుమారు 105 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ అర్హత కలిగి 18–35 ఏళ్ల వయస్సు నిరుద్యోగ అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఎస్వీయూలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

చతికిలపడిన చేనేత బతుకులు పునరుజ్జీవం పొందుతున్నాయి. అటకెక్కిన మగ్గాలు మళ్లీ నిర్విరామంగా పనిచేస్తున్నాయి.. వలసబాట పట్టిన కుటుంబాలు నేడు నేత వృత్తినే జీవనభృతిగా మార్చుకున్నాయి.. ఆదాయం లేక అణగారిన కార్మికుల స్థితిగతులు ఇప్పుడు గాడిలో పడుతున్నాయి. పొట్ట పోషణకే ఇక్కట్లు పడిన జీవితాలు ప్రస్తుతం చేతి నిండా పనితో దర్జాగా కాలం వెళ్లదీస్తున్నాయి. ముఖ్యంగా కోవిడ్ సమయంలో నడివీధిలోకి వచ్చేసిన చేనేత రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేయూతనందించారు. వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద ఆర్థికసాయం అందజేశారు. బక్కచిక్కిన బతుకుల్లో వెలుగులు నింపారు. ముగిసిపోయిందనుకున్న నేత పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకువచ్చారు.

మగ్గం మెరిసె!



చేనేత మగ్గం, (ఇన్‌సెట్) నేతన్నలు తయారు చేసిన పట్టుచీరలు

- చేనేతకు మహర్దశ
- నేతన్నలకు ప్రభుత్వం చేయూత
- కుదేలైన బతుకుల్లో వెలుగులు నింపిన 'నేస్తం'
- జిల్లాలో మొత్తం 197 మందికి లబ్ధి
- సర్కారు సాయంతో కోలుకున్న నేత పరిశ్రమ



చేనేత కార్మికులకు నేతన్న నేస్తం చెక్కు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

నగరి : చేనేత రంగానికి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. నేత వృత్తిని నమ్ముకొని జీవిస్తున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భరోసా కల్పించారు. చేనేత కార్మికుల స్థితిగతులను మార్చి మెరుగైన జీవన ప్రమాణాలను అందించడమే లక్ష్యంగా వైఎస్సార్ నేతన్న నేస్తం పథకానికి శ్రీకారం చుట్టారు. అర్హులైన చేనేత కార్మికులకు ఏటా రూ.24 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. జిల్లాలోని 13 మండలాల్లో మొత్తం 325 మంది మగ్గాలు కలిగిన చేనేత కార్మికులు ఉన్నారు. సుమారు 1,200 మంది ఈ వృత్తిపై పరోక్షంగా ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో 10 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. కుదేలైన చేనేత పరిశ్రమకు పునరుజ్జీవం పోసేందుకు ప్రభుత్వం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని 2019 డిసెంబర్ 21వ తేదీన ప్రారంభించింది. కరోనా లాక్ డౌన్ సమయంలో ఆర్డర్లు లేక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న చేనేత కార్మికులకువైఎస్సార్ నేతన్న నేస్తం అండగా నిలిచింది. ఆ సమయంలో ప్రభుత్వం రెండో విడత ఆర్థికసాయాన్ని ఆరు నెలల ముందుగానే పంపిణీ చేసి కార్మికులను ఆదుకుంది. ఈ మేరకు ఐదు విడతల్లో జిల్లాలోని ఒక్కో చేనేత కుటుంబం రూ.1.20 లక్షల సాయం అందుకుంది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 194 మంది చేనేత కార్మికులకు నేతన్న నేస్తం కింద లబ్ధి చేకూరింది. ఇప్పటి వరకు ఐదు విడతల్లో జిల్లాలోని చేనేతలకు రూ. 2.20 కోట్లు ఆర్థిక సాయం అందింది. ఈ సాయంతో నేతన్నలు ఫెడల్ లూమ్స్, నూతన డిజైన్లు ఇచ్చే జక్కార్డ్‌లు, బాబిన్లు కొనుగోలు చేసుకున్నారు. వృత్తిని సాంకేతికంగా మార్పు చేసుకొని అభివృద్ధి పథంలో నడుస్తున్నారు. గతలంట పనిలేక అవస్థలు పడినవారు, ఇప్పుడు సరిపడా పనులతో జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకుంటున్నారు.

నాడు టీడీపీ హయాంలో..

- వర్షాకాలంలో పరిశ్రమకు అంతరాయం కలుగుతున్నందున నెలకు రూ .4 వేలు చెల్లిస్తామన్నారు. వంద యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్యబీమా, చేనేత కార్మికులకు ఇళ్లు, షెడ్లు, పట్టణాల్లో జీ +3 భవనాలు అంటూ దాదాపు 18 జీఓలు విడుదల చేశారు. అయితే అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు.
- టీడీపీ ప్రభుత్వ విధానాలతో చేనేత రంగం పూర్తిగా దెబ్బతింది.
- అరకొర నిధులతో వీవర్స్ వెల్ఫేర్ ప్యాకేజీ అంటూ హడావుడి చేసి చేతులు దులుపుకున్నారు.
- ఆదరణ పథకం కింద డబ్బులు కట్టించుకొని అరకొర సామగ్రి ఇచ్చి మమ అనిపించారు.
- నేతన్నలు తమను ఆదుకోవాలని ఎన్నిసార్లు విన్నవించినా విస్మరించారు.

నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

- జిల్లా వ్యాప్తంగా 194 మంది చేనేత కార్మికులకు నేతన్న నేస్తం అందించారు. ఇప్పటి వరకు ఐదు విడతల్లో జిల్లాలోని చేనేతలకు రూ. 2.20 కోట్లు పంపిణీ చేశారు.
- వృద్ధులై వృత్తిని విడిచిపెట్టిన 3,263 మంది నేత కార్మికులకు ప్రతి నెలా రూ.3వేల చొప్పున పింఛన్ అందిస్తున్నారు.
- 2022–23లో 53 మంది చేనేత కార్మికులకు రూ.26.50 లక్షలు, 2023–24లో 60 మందికి రూ.30 లక్షల బ్యాంకు రుణాలు అందించారు.
- జిల్లాలో పెనుమూరుకు చేనేత క్లస్టర్ మంజూరు చేశారు. 100 మంది లబ్ధిదారులకు రూ.100.04 లక్షలు మంజూరు, కాగా 50 శాతం నిధులను ఇప్పటికే విడుదల చేశారు.
- 50 మంది లబ్ధిదారులకు 90 సబ్సిడీపై మగ్గాలు అందించారు. 12 మందికి వ్యక్తిగత వర్క్‌షెడ్లు మంజూరు చేశారు. మరో 50 మంది 90 శాతం సబ్సిడీపై మగ్గాలు, 13 మందికి వర్కుషెడ్లను త్వరలోనే మంజూరు చేయనున్నారు.

నేతన్న నేస్తం కింద జిల్లా సమాచారం

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	అందించిన సొమ్ము (రూ.లక్షల్లో)
2019-20	199	47
2020-21	217	52
2021-22	153	36
2022-23	166	39
2023-24	194	46
మొత్తం		రూ.2.20 కోట్లు



రాట్నం వడుకుతున్న కార్మికురాలు

జీవన ప్రమాణాలు మెరుగు



గతంలో గుడియాత్తం లుంగీలు నేసేవారు నేడు ప్రభుత్వ సాయంతో కొత్తరకం లుంగీల నేతకు మారారు. 200 నుంచి 300 మీటర్ల పడుగు చేసుకొని దాంతో నెల రోజుల వరకు లుంగీలు నేసుకుంటున్నారు. ముందు వారానికి రెండు సార్లు వీధిలోకి వచ్చి అల్లు కొట్టేవాళ్లం. ప్రస్తుతం అలా చేసుకునే పని తప్పింది. నెల రోజుల వరకు ఒకే పడుగుతో పనిచేసే అవకాశం వచ్చింది. ఇలా సదుం మండలంలోనే 25 మగ్గాలను ఇప్పించాం. పిల్లలను బాగా చదివించుకుంటున్నాం. జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయి.

– పీవీ కృష్ణయ్య, చేనేత కార్మిక యూనియన్ జిల్లా అధ్యక్షుడు, సదుం

రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్షేత్రస్థాయిలో నేతన్నల కష్టాలు తెలుసుకున్నారు.అందుకే ఇచ్చిన హామీని క్రమం తప్పకుండా ఏటా అమలు చేస్తున్నారు. ఈ పథకంతో నేతన్నల ఇక్కట్లు తొలగుతున్నాయి. మాకు ఇంత అండగా నిలిచిన ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– ఆకుల వాసు, చేనేత కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

కనుమరుగయ్యేది



కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న చేనేత రంగానికి నేతన్న నేస్తం పథకంతో ప్రభుత్వం ఊపిరి పోసింది. ఈ పథకం లేకుంటే చేనేత పరిశ్రమ కనుమరుగయ్యేది. నేతన్న నేస్తం కింద నాకు ఇప్పటి వరకు రూ.1.20 లక్షలు అందింది. దీంతో కొత్తరకం బాబిన్లు, జక్కార్డులు కొనుగోలు చేసుకున్నా. ఈ ఏడాది అందే సాయంతో ఫెడల్ యంత్రాలు తెచ్చుకుంటా.

– జానకిరాముడు, లబ్ధిదారు, మాంగాడు, నగరి మండలం

భరోసా ఇస్తోంది



ఇంటిల్లపాది కష్టపడితేనే మగ్గం ముందుకు కదులుతుంది. అసలే అంతంత మాత్రంగా పనులు ఉన్నాయి. చాలీచాలని మజూరీలతో బతుకుబండి నెట్టుకువస్తున్నాం. మరో వృత్తి తెలియదు. జగనన్న నేత కార్మికుల కోసం ప్రవేశపెట్టిన నేతన్న నేస్తం పథకం ఎంతో భరోసా ఇస్తోంది. నాకు ఇప్పటి వరకు రూ.1.20 లక్షల ఆర్థిక సాయం అందింది.

– ఎస్.సుబ్రమణ్యం, లబ్ధిదారు, గొల్లపల్లి, పుత్తూరు మండలం

ఉపయోగపడింది



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద వచ్చిన ఆర్థిక సాయంతో వత్తిని మెరుగుపరచుకున్నా. చాలీచాలని ఆదాయంతో సతమతమయ్యే సమయంలో ఈ పథకం చాలా ఉపయోగపడింది. ఇప్పటి వరకు నాకు రూ.1.20 లక్షలు అందింది. ఈ సాయంతో లిఫ్టింగ్ యంత్రం కొనుగోలు చేసుకున్నా. ఇదివరకు పట్టు చీర నేయ దానికి 5 రోజులు పట్టేది. ప్రస్తుతం 3 రోజుల్లో చీర సిద్ధమవుతోంది.

– బాలాజీ, చేనేత యూనియన్ జిల్లా జనరల్ సెక్రటరీ

జగనన్నకు కృతజ్ఞతలు



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకంలో ఏడాదికి రూ .24 వేలు అందించడం ఎంతో ఉపయోగకరంగా ఉంది. నేతను వదిలి ఇతర పనుల్లోకి వెళదామనుకున్న దశలో ఈ పథకం అండగా నిలిచింది. నాకు అందిన సొమ్ముతో నూతన జక్కార్డ్, ముడి సరుకుల, సామగ్రి కొనుకున్నా. మమ్మల్ని ఆదుకున్న జగనన్నకు కృతజ్ఞతలు.

– సి.వెంకటముని, లబ్ధిదారు, గొల్లపల్లె, పుత్తూరు మండలం

ఆదుకుంది



నూలు తెచ్చుకోలేని దుస్థితిలో ఉన్న మా కుటుంబాన్ని వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ఆదుకుంది. ఎలాంటి సిఫార్సులు లేకుండా అర్హతే ప్రామాణికంగా నాకు పథకం అందించారు. అలాగే రూ.లక్ష రుణం కూడా మంజూరు చేశారు. ఇప్పుడు చక్కగా నేత వృత్తి చేసుకుంటున్నాం. మా అమ్మాయిని డిగ్రీ చదివిస్తున్నాం. దివ్యాంగుడై మా అబ్బాయి కడుపు నింపుతున్నాం.

– కె.సుభద్ర, లబ్ధిదారు, మాంగాడు, నగరి మండలం

'సురక్ష'తో సువర్ణాధ్యాయం



వైద్యశిబిరంలో సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

గుడిపాల: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్షతో వైద్యరంగంలో సువర్ణాధ్యాయం మొదలైందని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి తెలిపారు. మంగళవారం మండలంలోని ఏఎల్‌పురంలో ఆరోగ్య సురక్ష–2 శిబిరం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కింద ప్రజల ఇంటి ముంగిటకే వైద్యసేవలు వెళుతున్నాయన్నారు. అవసరాలకు తగ్గట్టు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు రెఫర్ చేసి ఆరోగ్యశ్రీ కింద చికిత్సలందిస్తునట్లు వివరించారు. వైద్య శిబిరంలో 240 మందికి సేవలు అందించారు. కార్యక్రమంలో వైద్యులు రష్మిత, వంశీకృష్ణ, చేతన్ పాల్గొన్నారు.

శిబిరాలకు విశేష స్పందన

చిత్తూరు రూరల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. మొత్తం 3,513 మంది సేవలు పొందారు. 14 మంది పీహెచ్‌సీ వైద్యులు, 27 మంది స్పెషలిస్టు డాక్టర్లు క్యాంపులో ప్రజలకు చికిత్స చేసి మందులు అందించారు. 296 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు.

104లో పోస్టులకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్: జిల్లాలోని 104 సర్వీసుల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 104 జిల్లా మేనేజర్ ప్రతాప్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పదోతరగతి ఉత్తీర్ణులై, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు డ్రైవర్ పోస్టుకు, ఏదైనా డిగ్రీ, కంప్యూటర్ పరిజ్ఞానం, టైపింగ్ స్కిల్స్ ఉన్నవారు డేటీ ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తుతోపాటు సర్టిఫికెట్లు జిరాక్స్‌లను చిత్తూరులోని జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఉన్న 108, 104 కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని..



మెట్టు మెట్టుకూ పూజ చేస్తున్న దశరథరామిరెడ్డి

నాయుడుపేట టౌన్: సంక్షేమ సారథి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ స్థానిక రెడ్డి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలూరు దశరథరామిరెడ్డి మంగళవారం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ మెట్ల మార్గంలో మోకాళ్లపై నడిచి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గమ్మ గుడికి వెళ్లే ప్రతి మెట్టుకూ పసుపు, కుంకుమ పెట్టి, కర్పూరం వెలిగించి మొక్కుకున్నారు. సూళ్లూరుపేట నియోజవర్గ అభ్యర్థి సైతం అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని కోరారు.

విధుల్లో చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : కొద్ది రోజులుగా సమ్మెలో ఉన్న సమగ్ర శిక్ష శాఖ పరిధిలోని ఉద్యోగులంతా విధుల్లో చేరినట్లు ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్ విద్యార్థుల పబ్లిక్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని కేజీబీవీ టీచర్లు సమ్మె విరమించారని చెప్పారు. అలాగే ఎంఐఎస్, ఐఈఆర్‌టీ, మెసెంజర్‌లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, సైట్ ఇంజినీర్లు సమ్మె విరమిస్తున్నట్లు లిఖిత పూర్వకంగా లేఖ అందజేసి విధుల్లో చేరారని వివరించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరల్ ఆఫీసర్ అజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

దత్తత గ్రామ దరహాసం

మంత్రి రోజాను సాదరంగా ఆహ్వానిస్తున్న గ్రామస్తులు



- మంత్రి రోజాకు అపూర్వ స్వాగతం
- అభివృద్ధి పనులకు అభినందన
- మీరాసాహెబ్‌పాళెం వాసుల ఆనందం

నగరి : మండలంలోని మీరాసాహెబ్ పాళెం గ్రామాన్ని మంత్రి ఆర్‌కే రోజా దత్తత తీసుకుని అభివృద్ధి చేశారు. ఈ క్రమంలో మంగళవారం దత్తత గ్రామంలో మంత్రి పర్యటించగా అపూర్వ స్వాగతం లభించింది. ఊరు రూపురేఖలను మారేలా అద్భుతంగా తీర్చిదిద్దిన మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె చలువతోనే దశాబ్దాల కష్టాలు తీరిపోయాయని ఆనందం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కనీస వసతులు లేక నానా అవస్థలు పడేవారమని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు సీసీ రోడ్లు నిర్మించారని, వీధి దీపాలు వేయించారన్నారు. గ్రామ సమీపంలో భూమిని కొనుగోలు చేయించి మరీ స్థానికులకు 52 ఇళ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. నాడు–నేడు కింద పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో సిద్ధం చేయించారని వెల్లడించారు. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయించి నాణ్యమైన చికిత్సలు అందించారన్నారు. అల్లా దయతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మంత్రి రోజాను ముస్లిం పెద్దలు ఆశీర్వదించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి మంత్రి నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. ఎలాంటి సమస్యలున్నా పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. పేదలకు సాయం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ఈ క్రమంలోనే ఎస్పీ అలీ అనే వ్యక్తి విన్నపం మేరకు వారి ఇంటికి వెళ్లి కుటుంబీకులతో మమేకమయ్యారు. వారి స్థితిగతులు అడిగి తెలుసున్నారు. ఎలాంటి సాయం అవసరమైన వెంటనే సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఇమ్రాన్‌ఖాన్, సర్పంచ్ నందినీ సతీష్, హసీమ్, ఎస్ఎం బాషా, పీఎస్ గౌస్, అబ్దుల్ ఖాదర్, వేలు, బాలాజీ, దేవమందడి, హరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్ట్రాంగ్‌రూమ్‌లలో వస్తువుల తొలగింపునకు కమిటీ


మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఖజానా కార్యాలయాల్లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచిన వివిధ శాఖల వస్తువులను తొలగించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల సామగ్రిని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచాలని, ఆ మేరకు ఇప్పుడు ఉన్న వివిధ శాఖ వస్తువులను వెంటనే తీసుకెళ్లాలని ఆదేశించారు. కమిటీ పర్యవేక్షణలో తొలగింపు ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ రాజశేఖర్, జిల్లా ట్రెజరీ శాఖ డీడీ రామచంద్ర, డీఈఓ విజయేంద్రరావు, డీపీఓ లక్ష్మీ, జిల్లా రిజిస్ట్రార్ రామచంద్ర పాల్గొన్నారు.

పంటలపై గజరాజుల దాడి


ఏనుగులు విరిచేసిన మామిడి కొమ్మలను చూపుతున్న రైతు ఈశ్వరమ్మ

పెద్దపంజాణి: మండలంలోని పెద్దకాప్పపల్లె, ఆకులవారిపల్లి, గౌరీనగర్, ముదిరెడ్డిపల్లె, జిట్టంవారిపల్లె, పెనుగొలకల, తిప్పిరెడ్డిపల్లె, కొత్తబూరగపల్లెలో సోమవారం రాత్రి ఏనుగులు బీభత్సం సృష్టించాయి. పలువురు రైతులకు చెందిన మామిడి, కొబ్బరి, అరటి చెట్లను ధ్వంసం చేశాయి. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగులను కట్టడి చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ఆ'దర్శనీయ క్షేత్రం'.. బోయకొండ

- పర్యాటకకేంద్రంగా దినదినాభివృద్ధి
- ఏటా రూ.12 కోట్ల నుంచి రూ.15 కోట్ల ఆదాయం
- రూ.10కోట్లతో ఎకో టూరిజం సెంటర్
- రూ.40 కోట్లతో మాస్టర్ ప్లాన్ పనులు
- ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి


బోయకొండ ఆలయం


ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

చౌడేపల్లె : జిల్లాలోని బోయకొండ గంగమ్మ ఆలయం ఆదర్శవంతంగా అభివృద్ధి చెందుతోంది. పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవతో బోయకొండ ప్రణాళికాబద్ధంగా ప్రగతిపథంలో పయనిస్తోంది. వారి పర్యవేక్షణలో అధికార యంత్రాంగం బోయకొండలో సుమారు రూ.200 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టింది. ఆలయ పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దింది. ఫలితంగా భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. అమ్మవారి ఆలయ ఆదాయం సైతం ఏటా రూ.12 కోట్ల నుంచి 15 కోట్లకు చేరింది. దీనిపై మంత్రి పెద్దిరెడ్డి ప్రతిపాదనల మేరకు ఆలయానికి అసిస్టెంట్ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్ స్థాయి ఈఓ నియమితులయ్యారు.

పకడ్బందీ సౌకర్యాలు

బోయకొండకు నిత్యం తరలివచ్చే వేలాది మంది యాత్రికులకు పకడ్బందీగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి పర్యవేక్షణలో పెద్దసంఖ్యలో భక్తులు వచ్చినా ఎలాంటి ఇబ్బంది పడకుండా సులువుగా అమ్మవారి దర్శనం చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు.

రూ.కోట్లతో అభివృద్ధి పనులు

బోయకొండ సుందరీకరణతోపాటు వసతులు, భవన నిర్మాణాలను మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రూ.40 కోట్లతో చేపట్టేందుకు పాలకమండలి ఆమోదం తెలిపింది. ఉన్నతాధికారుల అనుమతి రాగానే పనులు ప్రారంభించాలని నిర్ణయించింది. అలాగే బోయకొండ గంగాపురంలో రూ.10 కోట్ల వ్యయంతో 11 హెక్టారుల్లో ఎకో టూరిజం సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. అందులో భాగంగా రూ.2కోట్లతో తొలిదశ పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నారు.

ప్రత్యేక గుర్తింపు



రాష్ట్రంలోనే ఆధ్యాత్మిక క్షేత్రంగా, పర్యాటక క్షేత్రంగా బోయకొండక ప్రత్యేక గుర్తింపు తీసుకవచ్చాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పకడ్బందీగా అభివృద్ధి చేస్తున్నాం. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులకు మాస్టర్ ప్లాన్ రూపొందించాం. దశల వారీగా అమలు చేస్తున్నాం.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మంత్రి

చరిత్ర తెలిసేలా..



రాబోయే తరాలకు చరిత్ర తెలిసేలా బోయకొండను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో అవసరమైన నిధులు సమకూర్చి అభివృద్ధి చేస్తున్నాం. యాత్రికుల్లో ఆధ్యాత్మికత పెంపొందేలా, ఆహ్లాదకరంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు అవసరమైన వసతులు కల్పిస్తున్నాం.

– పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

సంతోషంగా ఉంది



బోయకొండ ఆలయాన్ని ఏసీ పరిధి నుంచి డీసీ స్థాయిని కల్పించడం ఆనందంగా ఉంది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో గంగమ్మ ఆలయాన్ని మరింతగా అభివృద్ధి పథంలోకి తీసుకెళతాం. అధికారులు, పాలకమండలితో సమన్వయం చేసుకుంటూ బాధ్యతాయుతంగా సేవలందిస్తాం.

– నాగరాజారెడ్డి, చైర్మన్, బోయకొండ ఆలయ కమిటీ

అందుబాటులోకి అండర్ బ్రిడ్జి!


అండర్ బ్రిడ్జి వద్ద పనులు పరిశీలిస్తున్న మంత్రి రోజా

- పనులు ప్రారంభించిన మంత్రి రోజా

నగరి : పట్టణ పరిధిలోని ఏకాంబర కుప్పం వద్ద రైల్వేగేట్ కారణంగా తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు మంత్రి ఆర్‌కే రోజా చర్యలు చేపట్టారు. మంగళవారం ఈ మేరకు ఆ ప్రాంతంలోని అండర్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు పనులు ప్రారంభించారు. బ్రిడ్జి వద్ద పేరుకు పోయిన మట్టిని యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఆదేశించారు. రైల్వే గేట్ తరచూ వేస్తుండడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారన్నారు. అందుకే అండర్ బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. సదరన్ రైల్వే అధికారులతో మాట్లాడి అండర్ బ్రిడ్జి కింద నీరు నిల్వ చేరకుండా ఏర్పాట్లు చేయిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు భూబాలన్, బాబు, మురుగా, నాయకులు వినోద్, ఇళంగో, తనికాచలం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే జీవితం


రమ, గణపతినాయుడుతో వైఎస్సార్‌సీపీ నేతలు

పాలసముద్రం : వైఎస్సార్‌సీపీతోనే జీవితం ముడిపడి ఉందని, పార్టీని వదిలి వెళ్లే ప్రసక్తే లేదని పుత్తూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ తన భర్త గణపతి నాయుడు బ్యాంకులో పెన్షన్ విత్‌డ్రా చేసుకుని వస్తున్నప్పుడు కొందరు టీడీపీ నేతలు కండువా కప్పారన్నారు. అనంతరం గణపతి నాయుడు కుటుంబం టీడీపీలో చేరిందని సోషల్ మీడియాలో ప్రచారం చేశారని మండిపడ్డారు. మేము ఇప్పటి వరకు వైఎస్సార్ కుటుంబం వెంటే ఉన్నామని స్పష్టం చేశారు. టీడీపీ నేతలు ఇలాంటి నీచ రాజకీయాలకు పాల్పడడం దారుణమని విమర్శించారు. ఈ సందర్భంగా గణపతి నాయుడుకి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, రైతు భరోసా కేంద్రం చైర్మన్ పోలయ్య ఆధ్వర్యంలో పార్టీ కండువా వేశారు.





గ్రామీణాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా, మండల స్థాయి అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నవరత్నాల పథకాలు, ఉపాధిహామీ, నాడు–నేడు, జలజీవన్‌మిషన్‌తో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధ్యమన్నారు. వీటిని పటిష్టం అమలు చేసి, మరింత అభివృద్ధి చేయడానికి అధికారులు కృషి చేయాలన్నారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీలో వైఎస్సార్ క్రాంతి పథకం, ఉపాధిహామీ, ఫారెస్టు, పీఆర్, నీటిసరఫరా శాఖలు తమ కార్యచరణ సిద్ధం చేసుకోవాలని డీపీఓ లక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ తులసి, పలమనేరు డీఎల్‌డీఓ ఉమావాణి, డీపీఆర్సీ డీసీ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

మాన్యం భూమి స్వాహా!

- దర్జాగా కబ్జా చేసిన రియలర్లు
- అనుమతి లేకుండా భవన నిర్మాణం
- పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు


అక్రమంగా నిర్మిస్తున్న భవనం

చౌడేపల్లె : స్థానిక కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయానికి చెందిన మాన్యం భూమిని కొందరు దర్జాగా కబ్జా చేసేశారు. అక్రమంగా భవనాలు నిర్మిస్తున్నా దేవదాయశాఖ, పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు. వివరాలు.. చౌడేపల్లెలోని ప్రైవేటు బస్టాండు వద్ద రూ.కోట్ల విలువైన మాన్యం భూమిని కొందరు రియల్టర్లు ఆక్రమించుకుని దందా నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు సైతం లేకుండా పెద్ద భవనం సైతం నిర్మిస్తున్నా అధికారులు అటువైపు కూడా వెళ్లడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఆ స్థలంలో కొందరు వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసేసుకున్నారు. ఆక్రమణదారుల నుంచి అధికారులు మామూళ్లు తీసుకుని పట్టించుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై టెంపుల్ ఈఓ కమలాకర్‌ను వివరణ కోరగా ఆక్రమణలు వాస్తవమే అన్నారు. త్వరలోనే కబ్జాదారులకు నోటీసులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే ఆలయ స్థలంలో నోటీసు బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు కొత్త కార్యవర్గం


జిల్లా కమిటీతో రాష్ట్ర కమిటీ సభ్యులు

నగరి : జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ బాలాజీ, రిటర్నింగ్ ఆఫీసర్ అయ్యప్ప, అబ్జర్వర్ నరసయ్య సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. జిల్లా కమిటీ చైర్మన్‌గా బి.జగన్నాథం నాయుడు, వైస్ చైర్మన్‌గా ఎంవీ రవిబాబు, అధ్యక్షుడిగా వెంకటస్వామి, కార్యదర్శిగా పి.బాలాజీ, ట్రెజరర్‌గా ఆర్. బాలకృష్ణ నాయుడు, ఉపాధ్యక్షులుగా ఎం.ఫయాజ్ అహ్మద్, ఎం.హరినాథ్, ఎం.జయరామ్ శెట్టి, పి.జయచంద్ర, కె.సుబ్రమణ్యం, జాయింట్ సెక్రటరీలుగా వి.చంద్రశేఖర్, అవినాష్ కుమార్‌రెడ్డి, ఎం. రాజేష్, శివకుమార్, పురుషోత్తం, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా చెంచురత్నం, కుమార్‌ను ఎంపిక చేసినట్లు ప్రకటించారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్ : ఒకరి మృతి

రొంపిచెర్ల: మండలంలోని చిచ్చిలివారిపల్లె పంచాయతీ మల్లెలక్రాస్ వద్ద మంగళవారం రాత్రి ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. రంగారెడ్డిగారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి (50) పీలేరుకు వెళ్లి ఆటోలో ఇంటికి తిరిగి వెళుతుండగా తలపల నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణా రెడ్డి అక్కడిక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు పుత్తూరు విద్యార్థి


సిద్దూ

పుత్తూరు: నర్సారావుపేటలో ఈనెల 8వ తేదీన జరిగిన ఎస్‌జీఎఫ్ అంతర్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో సత్తా చాటిన పుత్తూరు జెడ్పీ తెలుగు పాఠశాల విద్యార్థి సిద్దూ జాతీయస్థాయి జట్టుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం రవి తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్థానిక గేట్ పుత్తూరు జెడ్పీ తెలుగు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి సిద్దూ అండర్-17 విభాగంలో పాల్గొని, జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో బీహార్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో సిద్దూ పాల్గొంటాడని తెలిపారు. తొలిసారిగా పుత్తూరు మండలం నుంచి జాతీయస్థాయి జట్టుకు ఎంపికైన క్రికెటర్‌గా సిద్దూ నిలవడంపై క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా ఫోన్‌లో అభినందనలు తెలిపారు. సిద్దూకు శిక్షణ ఇచ్చిన పీడీలు జయదేవ్, షమ్‌సుద్దీన్‌లను అభినందించారు.

రిపబ్లిక్‌డే పరేడ్‌కు పుత్తూరు విద్యార్థి



రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన మునస్వామి

పుత్తూరు: ఢిల్లీలో ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొనేందుకు స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి టి.మునస్వామి ఎంపికైనట్లు కళాశాల ఎన్‌సీసీ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మునస్వామిని అభినందిస్తూ సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న మునస్వామి ఇటీవల సికింద్రాబాద్‌లో జరిగిన ప్రీ రిపబ్లిక్ క్యాంపులో ప్రతిభ కనబరిచి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 29వ ఆంధ్ర బెటాలియన్ తరఫున ఎంపికై నట్లు వెల్లడించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కోటేశ్వరయ్య మాట్లాడుతూ కార్వేటినగరం మండలం డీఎంపురం గ్రామానికి చెందిన పేద వ్యవసాయ కుటుంబానికి చెందిన మునస్వామి క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీరయ్య పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత


మద్యంతోపాటు నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కుప్పం : పట్టణం సమీపంలోని బైరుగానపల్లె వద్ద మంగళవారం కారులో తరలిస్తున్న 576 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కంగుంది గ్రామానికి చెందిన నిందితులు మణికంఠ, కార్తీక్, షేక్ జాఫర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ కిషోర్ కుమార్ తెలిపారు.